# రేపటిలోగా సిఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయాలి

## టెలికాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 21 ప్రభాతవార్త :**

ఈనెల 23న సీఎం పర్యటన ఏర్పాట్లను రేపటిలోగా పూర్తి చేయాలని టెలికాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం టెలి కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతూ... హెలిప్యాడ్ పనులు, ప్రజా వేదిక సభ ఏర్పాటు ఎంతవరకు వచ్చాయో అని అడిగి తెలుసుకున్నారు.హెలిపాడ్ నుండి స్తభాస్తలి వేదిక వరకు రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. వాహనాల పార్కింగ్ పనులు, రూట్ల వారీగా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రణాళిక వివరాలు, గ్రీనరీ, స్టేజి ఏర్పాట్లు, స్టేజి అలంకరణ, పరిశుభ్రత, మిషన్ భగీరథ త్రాగునీరు, టాయిలెట్స్, సభకు హాజరయ్యే ప్రజలకు సదుపాయాలు అన్ని రేపటిలోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ఆర్డీవోలు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## డంపింగ్ యార్డును పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్

**గజ్వేల్ టౌన్, మే 21(ప్రభాతవార్త):** గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమఅగర్వాల్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలో అమృత్ 2.0లో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంకులను, వాటర్ పైపులైన్‌లను పరిశీలించారు. అనంతరం డంపింగ్‌యార్డులో బయో మైనింగ్ చేయబడిన జీరో వేస్ట్‌ను డిఆర్ సిసిలోని డ్రై వేస్ట్ ద్వారా రీసైక్లింగ్‌కు పంపే పాడిపనులను పరిశీలించారు. తడి చెత్త ద్వారా చేసే కంపోస్టును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, సిబ్బంది ఉన్నారు.



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న గరిమ అగర్వాల్



సిఎం ప్రారంభోత్సవం చేయనున్న మహాత్మా బసవేశ్వర కాంస్య విగ్రహం

## సిఎం ప్రారంభించే బసవేశ్వర కాంస్య విగ్రహం

-12 అడుగుల విగ్రహం తయారీకి 2 టన్నుల పంచలోహం

-25 మంది శిల్పులతో 6 నెలల్లో విగ్రహం తయారు

**న్యాల్‌కల్, మే 21, ప్రభాతవార్త:** ఈ నెల 23న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జహీరాబాద్ పట్టణ శివారులో జాతీయ రహదారి పక్కలో ఏర్పాటు చేసిన విశ్వగురువు మహాత్మా బసవేశ్వరుడి కాంస్య విగ్రహాన్ని మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామానికి చెందిన శిల్ప కళాకారుడు హోతి బస్వరాజ్ తయారు చేశారు. ఈ సందర్భంగా హోతి బస్వరాజ్ మాట్లాడుతూ తను తయారు చేసి బసవేశ్వరుడి విగ్రహాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. 12 అడుగుల కాంస్య విగ్రహం తయారికి 2 టన్నుల పంచలోహాన్ని వినియోగించి 6 నెలల పాటు 25 మందితో విగ్రహాన్ని తయారు చేశామన్నారు.

## ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

-సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



రైతు సుధాకర్‌ను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్

**గజ్వేల్ టౌన్, మే 21 (ప్రభాతవార్త):** అకాల వర్షాలు కురుస్తున్న కారణంగా కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్ తెలిపారు. బుధవారం గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కనిపించడంతో వెంటనే లారీలను రప్పించి హమాలీలతో లోడ్ చేయించి మిల్లులకు పంపించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యాన్ని అకాల వర్షాలతో తడవకుండా కవర్లతో కప్పాలని, కొనుగోలుచేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు.అలాగే తడిసిన ధాన్యాన్ని కూడా మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు తెలిపారు. అనంతరం గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి జాలిగామ గ్రామానికి చెందిన రైతు సుధాకర్ 30 ఎకరాలలో వరిధాన్యాన్ని లాభదాయకంగా పండించినందుకు శాలువాతో సన్మానించారు. వారి వెంట సివిల్ సప్లై డిఎం ప్రవీణ్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

## డంపింగ్ యార్డును పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్

**గజ్వేల్ టౌన్, మే 21(ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలో అమృత్ 2.0లో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంకులను, వాటర్ పైపులైన్‌లను పరిశీలించారు. అనంతరం డంపింగ్‌యార్డులో బయో మైనింగ్ చేయబడిన జీరో వేస్ట్‌ను డిఆర్ సిసిలోని డ్రై వేస్ట్ ద్వారా రీసైక్లింగ్‌కు పంపే పాడిపనులను పరిశీలించారు. తడిచెత్త ద్వారా చేసే కంపోస్టును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, సిబ్బంది ఉన్నారు.

## కెసిఆర్‌పై కక్షసాధింపులకు పాల్పడడం సిగ్గుచేటు

-బిఆర్ఎస్ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి కొట్టాల యాదగిరి

**గజ్వేల్, మే 21 (ప్రభాతవార్త):** ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టు గా చరిత్రకెక్కిన కాళేశ్వరం నిర్మాణంలో అవినీతి పేరిట మాజీ సిఎం కెసిఆర్‌పై కక్షసాధింపు చర్యలు చేపట్టడం సిగ్గుచేటని బిఆర్ఎస్ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ ముదిరాజ్ మహాసభ వైస్ చైర్మన్ కొట్టాల యాదగిరి ముదిరాజ్ విమర్శించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ధాన్యం దిగుబడిలో రాష్ట్రం ఆదర్శంగా నిలువగా, కెసిఆర్ ప్రత్యేక కృషి ఫలితంగా దేశానికి తెలంగాణ రైతు అన్నం పెట్టే స్థితికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు నివారించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయగా, జీర్ణించుకోలేని సిఎం రేవంత్‌రెడ్డి కెసిఆర్ కుటుంబంపై అక్రమ కేసులు బణాయిస్తున్నారన్నారు.సుమారు రూ.80వేల కోట్లతో చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్టులో చిన్నచిన్న లోపాలు సహజమని, వాటిని సాకుగా చూపుతూ కోడి గుడ్డుపై ఈకలు పీకే ప్రయత్నంచేస్తున్నట్లు ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్మాణం తో అధిక దిగుబడి రాగా ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసి నట్లు తెలిపారు. అకాల వర్షాలు పడుతున్నప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకున్న దాఖలాలు లేవని, అన్నదాతలు రోడ్లపై ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్పటికీ కనికరించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచాల్సిన సిఎం రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా డైవర్షన్ రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుతున్నట్లు ఆరోపించారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాం లో పోడు భూములు రైతులకు పట్టాలు అందించి పొజిషన్ చూపించగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆ రైతులను అటవీ అధికారులు వేధిస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. కోర్టులు చట్టాలపై తమకు పూర్తి నమ్మకం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావులపై ఎన్ని అక్రమ కేసులు బనాయించినా నిర్దోషిగా బయటపడటం ఖాయమన్నారు.

# గౌరవెల్లిని పూర్తిచేసి ప్రతీ ఎకరాకు సాగునీరు తీసుకొస్తా

## కాల్వల నిర్మాణాన్ని రైతులు అడ్డుకోవద్దు.. రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్ / అక్కన్నపేట, మే 21, ప్రభాతవార్త**

గౌరవెల్లి ప్రాజెక్టు పనులతో పాటు కాల్వలను త్వరలోనే పూర్తిచేసి ఈ ప్రాంతంలోని ప్రతీ ఎకరానికి సాగునీరు అందిస్తానని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంతో పాటు అక్కన్నపేటలో పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా బ్లాక్, మండల, పట్టణ, గ్రామ అధ్యక్ష స్థానాలకు సంబంధించి పీసీసీ పరిశీలకుల ఆధ్వర్యంలో రూపొందించిన దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. హుస్నాబాద్ నుండి జనగామాకు నాలుగు లైన్ల జాతీయ రహదారి మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్‌గడ్కారికి లేఖ రాస్తే వారు స్పందించి సానుకూలంగా లేఖ రాశారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో కార్యకర్తలు ప్రజలతో మమేకమై ఉండి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఏ సమస్య ఉన్న తనకు ఒక్క మెసేజ్ చెయ్యాలన్నారు. హైదరాబాద్‌లో ఉంటున్నా ఈ ప్రాంతం వాళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రతీ కార్యకర్త ప్రజల్లోకి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గురించి వివరించాలన్నారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నుండి ఒక్క సిద్దిపేట జిల్లాలోనే 45వేల మందికి నూతన రేషన్‌కార్డులు అందించిన విషయాన్ని గుర్తు చేశారు.అంతకు ముందు పార్టీ శ్రేణులతో కలిసి రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి, తదితరులు



ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి ఇసుకను వాడాలని సూచిస్తున్న యాదగిరి

'వార్త'కు స్పందన

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించిన డిఈ

**టేక్మాల్, మే 21 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చందుగాను ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుంది. కాగా టేక్మాల్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణాన్ని కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నాణ్యత లోపంగా ఉందంటూ ఈనెల 21వ తేదీన 'వార్త'దినపత్రికలో 'ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపం ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు' శీర్షికతో వెలువడిన కథనానికి గృహ నిర్మాణ శాఖ డిఈ యాదగిరి స్పందించారు. డస్ట్‌తో నిర్మాణం 'వార్త'కథనం వాస్తవమేనన్నారు. టేక్మాల్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ నమూనా గృహాన్ని బుధవారం సందర్శించి డస్ట్‌తో నిర్మాణం చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పునాది, బేస్‌మెంట్ సరిగ్గా లేకపోవడం చూసి మండిపడ్డారు. నాణ్యతతో కూడిన నిర్మాణాలు చేపట్టాలని ఆయన సూచించారు. నాసిరకంతో నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట మండల హౌజింగ్ ఎఈ కౌశిక్ ఉన్నారు.

# సిఎం సభకు చురుకుగా ఏర్పాట్లు

**జహీరాబాద్, మే 21, ప్రభాతవార్త:** ఈ నెల 23న జహీరాబాద్‌లో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవానికి హాజరవుతున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సభ సక్సెస్ చేసేందుకు అధికారులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. పట్టణంలోని బైపాస్ సమీపంలోని పివిఆర్ గార్డెన్ మైదానంలో హెలిప్యాడ్ ఏర్పాట్లు చేశారు. జహీరాబాద్ పట్టణంతోపాటు ఝరాసంగం మండలంలోని మాచ్‌నూర్ గ్రామ శివారులో నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవనం ప్రారంభోత్సవాల అనంతరం పివిఆర్ గార్డెన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో సిఎం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. బహిరంగసభకు జహీరాబాద్,అందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాల నుంచి ప్రజలను తరలించేందుకు జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ ఆధ్వర్యంలో సెట్విన్‌చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్ తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదివరకే ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ సిఎం సభ సక్సెస్‌కు పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. 23న ఉదయం 11 గటలకు హెలికాప్టర్ ద్వార సిఎం రేవంత్‌రెడ్డి జహీరాబాద్‌కు చేరుకుని హుగ్గెల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన మహాత్మా బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించి అక్కడినుంచి రోడ్డు మార్గాన ఝరాసంగం మండలం మాచ్‌నూర్‌కు చేరుకుని నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. జహీరాబాద్ పట్టణంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.



సిఎం బహిరంగ సభ ఏర్పాట్లు జరుగుతున్న దృశ్యం

## ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ



గజగట్లపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న హరీష్‌రావు

**చిన్నశంకరంపేట, మే 21,ప్రభాతవార్త:** మండల పరిధి గజగట్లపల్లిలో రాజ్యాంగనిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహన్ని బుధవారం ఎమెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు ఆవిష్కరించారు. గవ్వలపల్లి చౌరస్తా నుండి గజగట్లపల్లి వరకు దళిత సంఘం నాయకులు, పార్టీ కార్యకర్తలతో ద్విచక్ర వాహనలతో ర్యాలీగా వెల్లారు. భారీవర్షంలో విగ్రహన్ని ఆవిష్కరించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమెల్యేలు శశిధర్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరిశుభాష్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్, లావణ్యరెడ్డి, జితెందర్‌గౌడ్, ఆంజనేయులు, పార్టీ మండల అధ్యక్షుడు రాజు, సత్యనారాయణ, మీనా రవిందర్, అంజిరెడ్డి, లక్ష్మీనారాయణ, లింగరాజు, రవీందర్‌రెడ్డి, యాదగిరి, ప్రసాద్, సుధాకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సివిల్ జడ్జి హేమలత

## కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

### జూనియర్ సివిల్ జడ్జి హేమలత

**నర్సాపూర్, మే 21 ప్రభాతవార్త :** రైతులకు కల్తీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జూనియర్ సివిల్ జడ్జ్, లీగల్ సర్వీస్ కమిటీ మండల్ చైర్మన్ ఎం.హేమలత హెచ్చరించారు. బుధవారం నర్సాపూర్ మండలంలోని చిప్పల్‌తుర్తి గ్రామంలో కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో రైతులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి ఎం.హేమలత మాట్లాడుతూ రైతులు దేశానికి వెన్నుముకలాంటివాడని, రైతులు కష్టపడి పంటలు పండించి ప్రజలకు తినడానికి ఆహారం అందించిన రైతులు పంటలు పండించేటప్పుడు కావలసిన వరి విత్తనాలు కానీ ఎరువులు కానీ ఫర్టిలైజర్ కల్తీ చేసి రైతులకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు ప్రతి రైతు సేంద్రియ ఎరువులను వాడుకోవాలని దీంతో దీంతో పంటల్లో దిగుబడి అధికంగా వచ్చి ధాన్యం నాణ్యతగా ఉంటుందన్నారు. అంతేగాక రైతులు ఆక్సిజన్ ఇచ్చే చెట్లను పంట పొలాల్లో పెంచుకోవాలని దీంతో స్వచ్ఛమైన ఆక్సిజన్ తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండడానికి ఆస్కారం ఉంటుం దన్నారు. రైతులు సమస్యలు ఎదురైతే ఆత్మహత్యలు చేసుకోవద్దని ధైర్యంగా ఉండాలన్నారు. భూములకు సంబంధించిన ఏదైనా చట్టపరమైన సమస్యలు ఉంటే న్యాయ సహాయం కోసం మీ కేసులను కొనసాగించడం కోసం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్‌ను ఆశ్రయించాలని న్యాయమూర్తి సూచించారు. సదస్సులో రైతులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఏ ఎస్ ఐ సుందర్ రాజు, వ్యవసాయ శాఖ ఏఈవో తేజస్విని, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ చైతన్య, గాయత్రి, శ్రీ పూజ, గ్రామ పంచాయతీ కార్యదర్శి శృతిజా, మండల్ లీగల్ సర్వీస్ సిబ్బంది, గ్రామ రైతులు, గ్రామస్తులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు,



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

## దైనందిక జీవితంలో వ్యాయామం తప్పనిసరి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట రూరల్, మే 21, ప్రభాతవార్త :** దైనందిక జీవితంలో వ్యాయామం తప్పనిసరి అని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. సిద్దిపేట రంగనాయకసాగర్ ప్రాజెక్టుపై సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై 27న నిర్వహించే హాఫ్ మారథాన్ పరుగు వాల్ పోస్టర్‌ను సీపీ డా. అనురాధతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ జిల్లాలో ఉత్సాహవంతులైన యువతి, యువకులు హాఫ్ మారథాన్ పరుగులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వ్యాయామం, రన్నింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాజు, సభ్యులు హరికృష్ణ, నారాయణరెడ్డి, రాజిరెడ్డి, రమేష్, లింగారెడ్డి, శ్రవణ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి కృష్ణారెడ్డి, శ్రీనివాస్,మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మండలంలో అందుబాటులో జీలుగు, జనము విత్తనాలు

**బెజ్జంకి, మే 21, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోగల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహకార సంఘంలో సబ్సీడిపై పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగు, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని బుధవారం మండల వ్యవసాయ అధికారి సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు జీలుగు, జనుము విత్తనాల వినియోగంతో నేల సారవంతమై అధిక దిగుబడితో పాటు భూమికి బలం చేకూరుతుందని తెలిపారు. జనుము 50 బస్తాలు,జీలుగు 100 బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జనుము 40 కిలలో బ్యాగు ధర రూ.2510, జీలుగు 30 కిలోల బ్యాగు ధర 2138 లభిస్తుందన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఓ సంతోష్ తెలిపారు.

## వర్గల్‌లో ఉపాధి హామీ సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

**వర్గల్, మే 21 (ప్రభాతవార్త):** మండల పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ ఉపాధిహామీ పథకంలో నిర్వహించిన పనులకు సంబంధించి బుధవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో 16వ విడత సామాజిక తనిఖీ నిర్వహించడం జరిగింది. మండలంలోని గ్రామపంచాయతీలలో నిర్వహించిన పనులలో జరిగిన పొరపాట్లను తనిఖీ బృందం సభ్యులు వేదిక దృష్టికి తేవడం జరిగింది. ఉపాధి పనులలో పొరపాట్లకు బాధ్యులైన వారిపై రూ.7వేల జరిమానా విధించారు. అదేవిధంగా రూ.7,400 రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపిడిలు శివాజీ, శ్రీనివాస్‌గౌడ్, ఆరిఫ్, జెక్యూసివో సంతోష్‌రెడ్డి, ఎస్‌ఆర్‌పి పాండురంగం, డిఆర్‌పిలు, ఎంపిడిఓ మశ్చేందర్, ఎంపిఓ ఖలీం, ఏపిఓ జనార్ధన్, టిఏలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

## కొడుపాక సబ్‌స్టేషన్ సమస్యలు పట్టవా...?

### రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా సభ్యులు శశిధర్‌రెడ్డి

**పాపన్నపేట, మే 21, ప్రభాతవార్త :** ప్రమాదాలు జరిగితేగాని కొడుపాక సబ్‌స్టేషన్‌ను పట్టించుకోరా అంటూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా సభ్యుల శశిధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కొడుపాక సబ్‌స్టేషన్‌ను సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొడుపాక సబ్‌స్టేషన్ నిర్మించి 25 ఏళ్లు కావస్తున్న ఇంత వరకు ప్రహరీగోడ నిర్మించలేదన్నారు. యార్డుకు సైతం ప్రహరీ లేదని, అందులో కంకర కూడా కానరావడం లేదన్నారు. గతంలో అనేక మూగజీవాలు కరెంట్‌షాక్‌తో మరణించాయని చెప్పారు. సమీపంలోనే ప్రభుత్వ పాఠశాల ఉందని, విద్యార్థులు తరచుగా సబ్‌స్టేషన్ వైపు వస్తున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం, రైతు వేదిక కూడా అక్కడే ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని చెప్పారు. విద్యుత్ శాఖ నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పందించి ప్రహరి గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నవీన్‌గౌడ్, వెంకటేశం, సొసైటీ మాజీ డైరెక్టర్ వెంకోబా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శశిధర్‌రెడ్డి

# మహిళలు, పిల్లల రక్షణకు పెద్దపీట వేయాలి

## సిపి డాక్టర్ అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

షీటీమ్, భరోసా,స్నేహిత సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి మహిళల, పిల్లల రక్షణకు పెద్దపీట వేయాలని సీపీ డాక్టర్ అనురాధ సూచించారు. సీపీ కార్యాలయంలో బుధవారం షీటీమ్, భరోసా, స్నేహిత సిబ్బందితో మహిళల, పిల్లల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. షీటీమ్ బృందం, భరోసా సెంటర్ సిబ్బంది మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలతోపాటు సామాజిక రుగ్మతలపై గ్రామాల్లో ప్రజలు పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. పిల్లల, మహిళల రక్షణకు మేమున్నామని పూర్తి నమ్మకం, భరోసా కల్పించాలని చెప్పారు. మహిళలను, పిల్లలను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఫోక్స్ కేసుల వివరాలు యువతి, యువకులకు ప్రజలకు తెలిపి అవగాహన కల్పించాలని సూచించారు.ఒకసారి జీవితంలో తప్పటడుగు వేస్తే జీవితం మొత్తం నాశనం అవుతుందని తెలిసేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళ పోలీసుస్టేషన్ సీఐ దుర్గ, సీఐ శ్రీధర్‌గౌడ్, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్ల షీటీమ్, భరోసా సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ అనురాధ

## తులసీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుని ఎన్నికలకు నామినేషన్‌లు పూర్తి



తులసీ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుని పోటీలో నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారులకు అందజేస్తున్న ఠాకూర్ అంకిత్ సింగ్.

**యూసుఫ్‌గూడ, మే 21, ప్రభాతవార్త :** ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే బస్తీ ఎన్నికల్లో భాగంగా తులసీ నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు గాను అధ్యక్షుని పోటీలో ఠాకూర్ అంకిత్ సింగ్ తన నామినేషన్‌ను ఎన్నికల అధికారులకు అందజేశారు. జూన్ 1వ తేదీన ఎన్నికలు జరుగుతాయని ఆదివారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎన్నికలు నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తున్నట్లు ఎన్నికల అధికారులు కె.సురేందర్, గంగ వర ప్రసాద్ రావులు పేర్కొన్నారు.

## మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి



బోరబండలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్న బోరబండ కార్పోరేటర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా

**యూసుఫ్‌గూడ, మే 21, ప్రభాతవార్త :** భారతదేశాన్ని అనేక రంగాలలో అభివృద్ధి చేయడంతో పాటు ఐటి రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి భారత మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్‌గాంధీ అనిన బోరబండ కార్పోరేటర్ బాబాఫసి యుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా కొనియాడారు. బుధవారం బోరబండ కాంగ్రెస్ కార్పోరేటర్ కార్యాలయం వద్ద రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, సంతోష్, కలీమ్, మున్నా, కృష్ణ, రషీద్, వెంకటలక్ష్మీ, అన్సర్, కవిత, రవి, తదితరులు పాల్గొన్నారు.

## అబేద్ అలీని పరామర్శించిన నిరంజన్



కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అబేద్ అలీని పరామర్శిస్తున్న రాష్ట్ర వెనుక బడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

**చార్మినార్,మే 21 ప్రభాతవార్త :** అనారోగ్యంతో బాధ పడుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అబేద్ అలీని బుధవారం రాష్ట్ర వెనుక బడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ పరామర్శించారు.బహదూర్‌పుర నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అబేద్ అలీకి మూత్ర పిండాల వ్యాధికి సంబంధించిన ఆపరేషన్ జరిగింది.రాష్ట్ర వెనుక బడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్,బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్యలాల్,మహ్మద్ ఇక్బాల్,బారి ఖాన్ లు కాంగ్రెస్ నాయకులు కలిసి బుధవారం మిశ్రిగంజ్‌లోని అబేద్ అలీకి వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పాతబస్తీ ఛత్రినాకలో రక్త దాన శిబిరం



ఛత్రినాక సిఐ ప్రసాద్ వర్మ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నరేష్‌కు సర్టిఫికేట్ అందజేస్తున్న దృశ్యం

**చార్మినార్,మే 21 ప్రభాతవార్త :** పాతబస్తీ ఛత్రినాకలోని ఆర్‌డి ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఛత్రినాక పోలీసుల ఆధ్వర్యంలో రక్త దానం శిబిరం జరిగింది.దక్షిణ మండలం డిసిపి స్నేహ మెహ్రా రక్త దాన శిబిరాన్ని ప్రారంభించారు.దాదాపు నూట నలభై మూడు మంది రక్త దానం చేశారని ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వర్మ తెలిపారు.దాతలు ఇచ్చిన బ్లడ్‌ను తలసీమియా సికిల్ సెల్ వ్యాధి గ్రస్థుల కోసం అందజేశారు.రక్త దానం చేసిన చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నరేష్‌తో పాటు పలువురికి ఛత్రినాక పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వర్మ సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజు యాదవ్,ఛత్రినాక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## జూన్ 3 నుంచి టిటిడి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు. చిత్రంలో యు.రమేష్, వైటివి త్రినాథ్‌బాబు

**సైఫాబాద్, మే 21 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 3వ తేదీ నుంచి 7 వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ మేరకు బుధవారం తిరుమలలో దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు, ఎఇవో యు.రమేష్, డోనర్ వై.టి.వి. త్రినాథ్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి.ఆర్.నాయుడు మాట్లాడుతూ 3వ తేదీ నుంచి 7 వతేదీ వరకు జరిగే ఈ బ్రహోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు. అంకురార్పణ మొదలు కొని ప్రతి రోజు స్వామికి ప్రత్యేకం పూజలు, తిరువిధుల్లో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఊరేగింపులు కొనసాగుతాయని చెప్పారు.



బాలంరాయిలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు



రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సర్వే సత్యనారాయణ



బోయిన్‌పల్లి మార్కెట్‌లో రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న మారె ్కట్ చైర్మన్ ఆనంద్ బాబు తదితరులు



రాజీవ్ గాంధీకి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న డాక్టర్ రవి శేఖర్‌రెడ్డి



రాజీవగాంధీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న జంపన



గోల్నాక అల్వాల్‌లో రాజీవ్ విగ్రహం వద్ద నేతలు



రాజీవ్ గాంధీకి నివాళులు అర్పిస్తున్న హన్మంత్‌రెడ్డి

# రాజీవ్ గాంధీ సేవలు అమోఘం

**కంటోన్మెంట్‌లో...**

**కంటోన్మెంట్,మే 21 ప్రభాతవార్త:** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కంటోన్మెంట్ 3వ వార్డు బాలంరాయి కమాన్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మారె ్కట్ తొలి చైర్మన్ ముప్పిడి గోపాల్, కాంగ్రెస్ నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్, శ్యామ్‌సన్ రాజు, ఇటుక గోపి, మల్లేశ్, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

**బోయిన్‌పల్లి మార్కెట్‌లో**

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం బోయిన్‌పల్లి మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వర్ధంతి వేడుకల్లో మార్కెట్ యార్డు చైర్మన్ ఆర్. ఆనంద్ బాబు,వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్‌లు పాల్గొని రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**న్యూబోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో...**

మన దేశంలో తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా మాజీ ప్రధాని రాజీవగాంధీ వర్ధంతి రోజును నిర్వహిస్తున్నారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంపన ప్రతాప్ అన్నారు. రాజీవగాంధీ ముప్పై ఐదవ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు న్యూబోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి జంపన ప్రతాప్ నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులూ బంగారు సదానంద్. బల్వంత్ రెడ్డి. మారూతి గౌడ్. సాయిబాబా యాదవ్. ముకేశ్ యాదవ్. వరప్రసాద్. శశి. రాజు తదితరులు పాల్గొన్నారు.

**రాజీవ్ సర్కిల్‌లో...**

**కెపిహెచ్బి కాలనీ, మే 21, ప్రభాతవార్త :** దేశానికి గాంధీ కుటుంబమే రక్ష అని మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం రాజీవ్ గాంధీ 34 వర్ధంతి సందర్భంగా కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు పర్యవేక్షణలో రాజీవ్ సర్కిల్ వద్ద గల విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, కూకట్పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డిలు పాల్గొని ఘనంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాదు ప్రతాపరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, కరుణాకర్ నాయుడు, మేకల మైకల్ తదితరులు పాల్గొన్నారు.

**గండి మైసమ్మ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...**

**దుండిగల్, మే 21, ప్రభాతవార్త :** నేటి యువత రాజీవ్ గాంధీ ఆశయాలను అందిపుచ్చుకుని ఆ దిశగా అడుగులు వేస్తూ ఆయన కలలను సాకారం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం గండి మైసమ్మ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డిలు పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రాము గౌడ్, యాదిరెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముత్యంరెడ్డి, జక్కుల మల్లేష్ యాదవ్, కిషోర్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతకింది సురేష్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

**వెంగళరావ్‌నగర్‌లో...**

**ముషీరాబాద్, మే 21, ప్రభాతవార్త:** దేశసేవ కోసం జీవితాన్ని ధారపోసి, భరతమాత ఒడిలో తుదిశ్వాస విడిచిన దివంగత ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తామని యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీ.వి.రవిశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని వెంగళరావ్‌నగర్ ప్రధాన రహదారిలో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జైలర్ రంగారావు, ప్రొఫెసర్ టి.వి.రెడ్డి, సారంగరావు, సాంబయ్య, నాగరాజు, సాయి, మైనార్టీ నాయకులు పాషా తదితరులు పాల్గొన్నారు.

**అల్వాల్‌లో..**

**అల్వాల్, మే 21 ప్రభాతవార్త:** మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భక్తి శ్రద్ధలుతో నిర్వహించాయి. గోల్నాక అల్వాల్‌లోని రాజీవ్ విగ్రహానికి నేతలు,కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐటితో పాటుగా బ్యాంకింగ్ సంస్కరణలు ద్వారా దేశం ఆర్థికంగా నిలబడడానికి రాజీవ్ గాంధీ ఎనలేని కృషి చేశారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నేతలు నిమ్మ అశోక్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, సిఎల్ యాదగిరి, సూర్యకిరణ్, సురేందర్ రెడ్డి, కొండల్ రెడ్డి,ఉదయ్, సంజీవ్ కుమార్, వీనస్ మేరి, బబిత, నిర్మల, రమాదేవి ఇతరులు పాల్గొన్నారు.

**బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో**

**నిజాంపేట్, మే 21, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పులమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో బీదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్, ఎన్ఎంసి అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్, ఎన్ఎంసి మహిళ అధ్యక్షురాలు కడియాల ఇందిరా, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పుట్టగొడుగుల వెలుస్తున్న ప్రైవేట్ హాస్టల్స్

**-పేయింగ్ గెస్ట్ పేరుతో దారుణంగా మోసాలు**

**-చోద్యం చూస్తున్న ప్రభుత్వ అధికారులు**

**-లక్షల్లో ఆదాయం. జిహెచ్ఎంసి, ప్రభుత్వ ఆదాయానికి గండి**

**చిక్కడపల్లి, మే 21 (ప్రభాతవార్త) :** అధికారుల పర్యవేక్షణ లోపం , ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే ముషీరాబాద్ నియోజకవర్గంలో పుట్టగొడుగుల్లా ప్రైవేట్ హాస్టల్స్ వెలుస్తున్నాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప తీసుకుంటున్న చర్యలు శూన్యమనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. హాస్టల్స్ ఎలాంటి పర్మిషన్ లేకుండా గత కొన్ని ఏళ్లుగా చిక్కడపల్లి, జవహర్ నగర్, అశోక్ నగర్, రాంనగర్, బాగ్ లింగంపల్లి, ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో ఈ విధంగా ప్రైవేట్ హాస్టల్స్ విపరీతంగా వెలుస్తున్నాయి. డబుల్ బెడ్ రూమ్, త్రిబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఉంటే చాలు దర్జాగా ప్రైవేట్ హాస్టల్స్ ఏర్పాటు చేసుకుని పోటీపరీక్షల కోసం సన్నద్ధమయ్యే వారి వద్ద విపరీతంగా డబ్బులు వసూలు చేసుకుంటూ కాసులు దండుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. ఫైర్ సేఫ్టీ , బిల్డింగ్ పర్మిషన్,పోలీస్ పర్మిషన్, జీహెచ్ఎంసి , విద్యుత్ అధికారుల నుండి ఎలాంటి పర్మిషన్ లేకుండా డొమెస్టిక్ సిలిండర్లు వాడుతు బిల్డింగ్ పార్కింగ్ లేకుండా గత కొన్ని ఏళ్లుగా నడుస్తున్నాయి. దాదాపుగా 50 నుంచి 100 హాస్టల్స్ అధికారుల కళ్ళు గప్పి ఇటు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి హాస్టల్ యజమానులు నెలకు లక్షల్లో సంపాదిస్తున్నరు. జిఎస్టి ,సిజిఎస్టి కట్టకుధా ప్రభుత్వ ఖజానకు గండి కొడుతున్న వారి పట్ల అధికారులు హాస్టల్లపైన దృష్టి సారించవలసిన అవసరం ఉన్నది. ప్రస్తుతం ప్రైవేట్ హాస్టల్స్ కాస్త రియల్ ఎస్టేట్ ప్రాంగణాలను తలపిస్తున్నాయి. పేయింగ్ గెస్ట్ (పిజి) వసతి గృహాలుగా అద్దెకు ఇవ్వడం ఇప్పుడు నగరంతో పైన పేర్కొన్న ప్రాంతాలలో లాభదాయకమైన వ్యాపారంగా మారింది. ఈ వసతి గృహాలలో చాలా వరకు పయింగ్ గెస్ట్ (పిజి) అని బోర్డులపై రాసి చెప్పుకునే సైన్‌బోర్డులు, కానీ ప్రస్తుతం అవి హాస్టళ్లుగా పనిచేస్తున్నాయి. జీహెచ్ఎంసి కేవలం గెస్ట్‌హౌస్‌లకు ఇచ్చిన ట్రేడ్ లైసెన్స్‌లను మాత్రమే ట్రాక్ చేస్తుంది, కానీ నగరంలో పేయింగ్ గెస్ట్ (శిబి) వసతి గృహాలుగా అనుమతులు లేకుండా ఉన్న హాస్టళ్ల లైసెన్స్‌లను ట్రాక్ చేయకపోవడంతో జీహెచ్ఎంసి లక్షలలో ఆదాయం కోల్పోతోంది. కాగా ప్రస్తుతం పయింగ్ గెస్ట్ కింద వోకొక్కరి వద్ద నుండి రూ.7 వేల నుండి రూ.8 వేల వరకు వసూలు చేస్తున్నారు. మూడు మూడు అంతస్థుల భవనాలను కాస్తా పయింగ్ గెస్ట్ అని చెప్పి నేడు ప్రైవేట్ హాస్టల్స్ గా మార్చుకుంటూ కాసులు దండుకుంటున్నారు. ఒక భవనాన్ని అద్దెకు ఇచ్చి హాస్టల్‌గా మార్చినప్పుడు అది వాణిజ్య భవనంగా మారుతుంది, దీనికి ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి, అయితే, సొంత ఇల్లు లేదా అపార్ట్‌మెంట్‌లోని గదిని అద్దెకు తీసుకుంటే ఇది తప్పనిసరి కాదు. కానీ ప్రస్తుతం ఎన్ని రిజిస్టర్ కాని హాస్టళ్లు పీజీ వసతి గృహాలుగా మారుస్తున్నాయో జీహెచ్ఎంసికి ఖచ్చితమైన ఆలోచన లేదు. జీహెచ్ఎంసి కూడా చూసీచూడనట్లుగా వ్యవరించడంతో ఆదాయాన్ని మాత్రం లక్షల్లో కోల్పోతోంది. కాగా ప్రస్తుతం సర్వీస్ అపార్ట్‌మెంట్లు ఎన్ని ఉన్నాయో వివరాలు జీహెచ్ఎంసి వద్ద లేకపోవడం, ఈ పీజీ వసతిని అద్దెకు తీసుకున్న వారి వివరాలు, కానీ వీరి వద్ద ఆ డేటా నమోదు లేదు. జీహెచ్ఎంసి ట్రేడ్ లైసెన్సులు జారీ చేయబడుతున్న గెస్ట్‌హౌస్‌ల సంఖ్యను మాత్రమే జీహెచ్ఎంసి ట్రాక్ చేస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ విధంగా అధికారుల పర్యవేక్షణ లోపం కారంగంగా పేయింగ్ గెస్ట్ బంగళాలు కాస్తా ప్రైవేట్ హాస్టల్స్ గా మారుతున్నాయి. పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రవేట్ హాస్టల్ యజమానులు, విపరీతంగా డబ్బులు వసూలు చేయడం మరో వైపు జీహెచ్ఎంసి అధికారులను ప్రసన్నం చేసుకోవడానికి ప్రైవేట్ హాస్టల్స్ యజమానులు ఇస్తున్న కాసులకు కక్కుర్తి పడుతూ ప్రభుత్వ ఆద్యానికి గండి కొడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా హాస్టల్లు నిర్వహిస్తున్నటువంటి బిల్డింగ్ ఓనర్ హాస్టల్ నిర్వాహకులు ఇష్టానుసారంగా వారికి నచ్చిన రీతిలో పేద విద్యార్థుల దగ్గర ఐదు వేల నుండి పదివేల రూపాయలు హాస్టల్ ఫీజుల రూపంలో వసులు చేస్తున్నారు. కనీసం నిబంధనలు పాటించడం లేదు. అశోక్ నగర్ తో పాటు చుట్టుపక్క ప్రాంతాలలో హాస్టల్స్ గదుల్లో ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఆ సూసైడ్ చేసుకున్నటువంటి విద్యార్థికి బిల్డింగ్ ఓనర్ గాని హాస్టల్ నిర్వహిస్తున్న నిర్వాకులు గాని ఆ విద్యార్థికి ఎలాంటి న్యాయం జరిగిన దాఖలాలు లేవు. హాస్టల్ నిర్వాహకులు మేము ఎంత చెపితే అంత అనే విధంగా వ్యవహరిస్తా ఉన్నారు. ఎలాంటి పర్మిషన్ లేకుండా నిర్వహిస్తున్నటువంటి హాస్టల్లో పైన అధికారుల అలసత్వం అక్కడున్న అధికారులు హాస్టల్ యజమానులు ఇస్తున్నటువంటి కాసులకు కక్కుర్తి పడి అటు విద్యార్థుల తల్లిదండ్రులకు ఇటు ప్రభుత్వాలకు గండి కొడుతున్నటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## దివంగత ప్రధానికి ఘన నివాళి



**అత్తాపూర్ మే21,ప్రభాతవార్త :** అతిపిన వయసులోనే భారతదేశ ప్రధాన మంత్రి పదవిని అధిష్టించి దేశ భవిష్యత్తుకు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు నేటి అభివృద్ధికి ఎంతో కీలకమని భారత ఆధునిక స్వామికుడు కీర్తిశేషులు రాజీవ్ గాంధీ అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ దేశం కోసం చేసిన సేవలను కొనిడాయారు.యువత రాజీవ్ గాంధీ ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ చైర్మన్,కాంగ్రెస్ నేతలు ధనుంజయ్, ఇంద్రపాల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## కొత్వాల్ గూడలో భూదాన్ భూములను రక్షించండి.

**- రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి గ్రామస్తుల ఫిర్యాదు**



**శంషాబాద్. మే 21. ప్రభాతవార్త :** శంషాబాద్ మండలంలోని కొత్వాల్ గూడ గ్రామంలో విలువైన భూదాన్ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని గ్రామస్తులు రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కొత్వాల్ కూడా సర్వేనెంబర్ 1. 4 5 లలో కోట్లాది రూపాయల విలువ చేసే భూదాన్ భూములు ఉన్నాయని గ్రామ మాజీ సర్పంచ్ గుర్రంపల్లి ప్రసన్న లింగం యాదవ్. మాజీ ఉపసర్పంచ్ పత్తి నరసింగరావు. శేఖర్ గుప్తా. యూత్ కాంగ్రెస్ నాయకుడు గుంటి నవీన్ కుమార్ ( మిట్టు) తెలిపారు. కోట్లాది రూపాయల విలువైన భూదాన్ భూములపై కన్నువేసిన కొంతమంది జెసిబి ల సహాయంతో చేదును చేస్తూ ఆ భూమి చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి భూదాన్ భూములను కాపాడాలని వారు కోరారు. మంత్రికి ఫిర్యాదు చేసిన వారిలో కొత్త కాపు నరసింహ రెడ్డి. నీరటి నరసింహ. చేవెళ్ల రాజేష్. పత్యారా ఏలియా. అల్వాల అంజయ్య. శ్రీనివాస్ యాదవ్ గంధం రవీందర్ ఉన్నారు.

## అంబటి కృష్ణమూర్తిపై జరిగిన దాడి ఖండన

**సైఫాబాద్, మే 21 ప్రభాతవార్త:** ఐఎన్‌టియుసి (ఆర్) జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తిపై మంగళవారం బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో రాజ్యసభ మాజీ సభ్యుడు, ఐఎన్‌టియుసి మాజీ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి వర్గీయులు దాడి చేయడాన్ని పలు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. బుధవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘా నేతలు జె.బి.రాజు, సత్యం, గొల్లపల్లి దయానందరావు, పోకల కిరణ్, నాగుల శ్రీనివాస్‌యాదవ్, బూదాల అమర్‌బాబు తదితరులు మాట్లాడుతూ ఐఎన్‌టియుసి నాయకుడిగా చెప్పుకుంటున్న సంజీవరెడ్డి వర్గీయులు అంబటి కృష్ణమూర్తిపై చేసిన దాడి యావత్ అనగారిని వర్గాలపై జరిగిన దాడిగా భావిస్తున్నామని, ఇది కేవలం పిరికిపందల చర్య అని విమర్శించారు. తక్షణమే వారిపైన క్రిమినల్ చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా నల్ల పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన



**అత్తాపూర్ మే21,ప్రభాతవార్త :** అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను బుధవారం వేధపండితుల మంత్రోచరణల మధ్య అంగరంగ వైభవంగా ప్రారంభమైయ్యాయి. బాబు జగ్జీవన్‌రామ్ యూత్ అసోసియేషన్ సభ్యులు, ప్రణవ భక్త సమాజం సభ్యుల ఆధ్వర్యంలో ఈ మహోత్సవాలను కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాల్లో బుధవారం ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచకం, మాతకపూజ, గోపూజ, పంచగవ్యప్రసన్యం దీక్షారాధన, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, అనంతరం అమ్మవారి విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి వివిధ పూజలు ఉంటాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ ఏర్పాట్లు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో చుట్టు పక్కల ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. 22వ తేదీన మండప పూజలు, మూల మంత్ర జపం రుద్ర హోమం, క్షీరాధ్వనం, జలదివాసం, హోమాలు, సాయంత్రం 5 గంటకు మూల మంత్ర హోమాలు, ఫల పున్వది శయాదివాసలు, 23వ తేదీన శుక్రవారం ఉదయం 5 గంటలకు మండప పూజలు, హోమాలు, అగస్యసంగర్తనాసం రత్న న్యాసం, బోజన్యాసం, ధాతున్యాసం, ఉదయం 7.36 నిమిషాలకు యంత్ర ప్రతిష్ట, విగ్రహప్రతిష్ట, కలశ ప్రతిష్ట, ఉదయం 9 గంటలకు కళాణ్యాసం, నేత్రమేళనం, 10 గంటలకు బలిప్రధానం, ధేను దర్శశనం జయ్యాదిహోమం, పూర్ణాహుతి, 11 గంటలకు కుంభాభిషేకం, బ్రహ్మణ ఆశీర్వచనం, హారతి, మంత్రపుష్ప తీర్థప్రసాద వినియోగం, మహాఅన్నతర్పణం, 12 గంటలకు మహా అన్నదానం ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విగ్రహ ప్రతిష్టపన మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## డాక్టర్ పులిగడ్డ హనుమంతరాయశర్మ రచించిన 'దేవీ వైభవం'

**-యరగొల్ల శ్రీనివాస్‌యాదవ్ బృందంచే 'సంకీర్తనా మాలిక' గానం**

**చిక్కడపల్లి, మే 21 ప్రభాతవార్త:** శ్రీ వేదభారతితి కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి మహోత్సవాల సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, కల్యాణానందపీఠం అధినేత డాక్టర్ పులిగడ్డ హనుమంతరాయశర్మ రచించిన 'దేవీ వైభవం' అమ్మవారి సంకీర్తనలను సంగీతరత్న యరగొల్ల శ్రీనివాస్‌యాదవ్ బృందంచే 'సంకీర్తనా మాలిక' గాన కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధినేత, వై.శ్రీనివాస్ యాదవ్ వివరించారు. 30న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పర్యావరణ ప్రేరణ వక్త ప్రకృతి వనం ప్రసాద్ హాజరవుతారని, కల్యాణానందపీఠం అధినేత డాక్టర్ పులిగడ్డ హనుమంతరాయశర్మ ప్రధాన ప్రసంగం ఉంటుందని వివరించారు. సభలో సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, బ్రహ్మశ్రీ వాణీవీణాపాణి శాస్త్రి, సిహెచ్.వి.పైడేశ్వరరావు యాదవ్, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్.రవీందర్, అంబేదనకర్ ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజు మాదిగ, శ్రీ వాసవీ పర్యావరణ ప్రచార సేవాసమితి వ్యవస్థాపకురాలు జూలూరి స్వరూపారాణి తదితరులు పాల్గొంటారన్నారు.



మాట్లాడుతున్న శివప్ప

## బసవేశ్వర విగ్రహావిష్కరణను విజయవంతం చేద్దాం

**సిద్దిపేట అర్బన్, మే 21, ప్రభాతవార్త :** సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈనెల 23న సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో జరిగే విశ్వ గురువు మహాత్మా బసవేశ్వర విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని సిద్దిపేట బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు నరకుల శివప్ప పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జిల్లా అధ్యక్షుడు భద్రప్పతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా నుంచి పెద్ద ఎత్తున వీరశైవ లింగ బలిజ సభ్యులు, ప్రజలు, నాయకులు పాల్గొన్నాలన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు ఉప్పెన గౌరిశంకర్, ఆకుల ప్రశాంత్, గండె శివకుమార్, మల్లేశం, అంజనేయులు, శ్రీనివాస్, రాజశేఖర్, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ



చిన్నజీయర్ స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న హరికృష్ణ తదితరులు

**సిద్దిపేట అర్బన్, మే 21,ప్రభాతవార్త :** శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు సిద్దిపేట ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు. సిద్దిపేట పట్టణంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఆయన పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్న జీయర్‌స్వామి చేతుల మీదుగా తీర్థ గోష్టి, ఆశీస్సులు పొందారు. అనంతరంనఆయన మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయా అభివృద్ధికి కాంగ్రెస్ సర్కారు కట్టుబడి ఉందన్నారు. స్వామి వారి ధాన్య మందిరానికి రూ.25 లక్షలు,అన్నదాన సత్రానికి రూ.35 లక్షలు దేవాదాయ,ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కృషితో మంజూరు చేయించడం జరిగిందన్నారు. అంతకు ముందు ఆలయ అర్చకులు,పాలక మండలి డైరెక్టర్లు హరికృష్ణను ఘనంగా సత్కారించారు. ఆయన వెంట పార్టీ శ్రేణులు, డైరెక్టర్లు మహేందర్‌రావు, లక్ష్మీ, పూజల గోపికృష్ణ, కలీం, మనోహర్‌రెడ్డి, పూజల బాలకృష్ణ, సాంబమూర్తి, బాలరాజు, సంతోష తదితరులు పాల్గొన్నారు.

## విద్యా నైపుణ్యాలు పెంచేలా ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ సునీత

**వర్గల్, మే 21(ప్రభాతవార్త):** కాలానికి అనుగుణంగా విద్యా నైపుణ్యాలు పెంచేలా ఉపాధ్యాయులకు మండలకేంద్రమైన వర్గల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా బుధవారం రెండవ రోజు శిక్షణ ఇవ్వడం జరిగిందని ఎంఈఓ సునీత తెలిపారు. రెండవ రోజు శిక్షణలో ఎల్ఎఫ్ఎల్, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఎంఆర్‌పిలు జె.రాజానరేందర్ రెడ్డి, టి.కనకయ్య, టి.జైపాల్‌రెడ్డి, సుజాతలు హాజరై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ స్థాపనలో విద్యార్థులను ఉత్తమమైన, ఆదర్శనీయమైన విద్యార్థులుగా సిద్ధం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు ఉత్తమ విద్యార్థులను తయారు చేయగలుగుతారని, సామర్థ్యాల పెంపుకై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థి అని, తాను నేర్చుకుంటూ విద్యాబోధన చేసినప్పుడే విద్యార్థులలో గుణాత్మకమైన మార్పు సాధించవచ్చున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, నూతన విషయాలను తెలియజేస్తాయని, ప్రతి ఉపాధ్యాయులు శిక్షణలో అందిస్తున్న అంశాలను ఆకలింపు చేసుకొని పాఠశాల స్థాయికి తీసుకెళ్లి విద్యార్థులలో ఆశించిన మార్పుల సాధన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎం.కనకరాజు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఐఎస్‌డి నవీన్‌కుమార్, సిసిఓ కరుణాకర్, సిఆర్‌పిలు యాదగిరి, కుమార్, భూపాల్, కృష్ణవేణి, జనార్దన్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ యాదవరెడ్డికి సన్మానం



ఎమ్మెల్సీ యాదవరెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

**గజ్వేల్, మే 21 (ప్రభాతవార్త):** ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి దంపతులను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వంటేరు గోపాల్‌రెడ్డి ఉమా, కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ నిమ్మ రమేష్, నూనె కుమార్‌యాదవ్, మాజీ ఏఎంసి డైరెక్టర్ ప్రవీణ్, మహిపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డిలు ఘనంగా సన్మానించారు. బుధవారం ఎమ్మెల్సీ యాదవరెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారిని కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపి భూపతి, కృష్ణ, రాము, కోటిస్వామి, యాదగిరి, ల్యాబ్ రాము పాల్గొన్నారు.

## పట్టణంలో ఉచిత వైద్య శిబిరం

**సదాశివపేట, మే 21, ప్రభాతవార్త:** పట్టణంలోని రవీంద్ర మోడల్ స్కూల్ వద్ద మల్లారెడ్డి మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత గర్భాశయ, రొమ్ము, క్యాన్సర్ వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆసుపత్రి బాధ్యులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు బుధవారం ఆహ్వాన పత్రికను అందచేశారు. ఉచిత వైద్య శిబిరానికి హాజరువుతానని ఎమ్మెల్యే హామి చేసినట్లు ఆసుపత్రి వైద్యులు సూచించారు.

## తహసీల్దార్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**మిరుదొడ్డి, మే 21, ప్రభాతవార్త :** మిరుదొడ్డి తహసీల్దార్‌గా శ్రీనివాస్ రెడ్డి ఇటీవల బాధ్యతలు చేపట్టగా బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భూపాల్‌గౌడ్, భూమాగౌడ్‌తో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని భూపాల్ గౌడ్ కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామకృష్ణ, నర్సింలు, మల్లేశం, రత్నం తదితరులు పాల్గొన్నారు.

# మూడోరోజు కొనసాగిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు





పూజ కార్యక్రమం నిర్వహిస్తున్న చిన్న జీయర్ స్వామి, చిత్రంలో హరీష్‌రావు, హాజరైన భక్త జనం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లా కేంద్రంలోని శ్రీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీనివాస స్వర్ణోత్సవ సమారోహం, బ్రహ్మోత్సవాలు మూడోరోజు బుధవారం అంగరంగ వైభవంగా కొనసాగాయి. చిన్న జీయర్‌స్వామి పర్యవేక్షణలో శ్రీసుదర్శన నారసింహ ఇష్టి వేదపండితులు ఘనంగా నిర్వహించారు. స్వర్ణోత్సవాలలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఉదయం చిన్న జీయర్‌స్వామి సన్నిధిలో తీర్థ గోష్టి నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి రథోత్సవం చిన్న జీయర్‌స్వామి పర్యవేక్షణలో వేద పండితులు కనుల పండువగా నిర్వహించారు.

అనంతరం చిన్న జీయర్‌స్వామి అనుగ్రహ భాషణంను భక్తులు శ్రద్ధగా అలకించారు. స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాలో భక్తులు పెద్ద సంఖ్య లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహి స్తున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుండడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది.

**ఉత్సవాలలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే**

వేంకటేశ్వరస్వామి దేవాలయ స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవ కార్యక్రమాలలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలు పూజ కార్యక్రమంలో చిన్న జీయర్ స్వామితో కలిసి పాల్గొన్నారు. చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా తీర్థం తీసుకుని ఆశీస్సులు పొందారు.

## ప్రభుత్వాలు మారుతున్నా ధాన్యం సేకరణలో తీరు మారడం లేదు

### -బిజెపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి

**ధారూరు, మే 21, ప్రభాతవార్త:** ప్రభుత్వాలు మారుతున్న ధాన్యం సేకరణలో మాత్రం తీరు మారడం లేదని వికారాబాద్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగారం, గురుదోట్ల గ్రామాలలో ధారూర్ పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి కాంట్రాక్టర్ కనీసం 50 లారీలు పెట్టమంటే కేవలం 10 లారీలు ఏర్పాటు చేసి ధాన్యం తరలించడంలో విపరీతమైన ఆలస్యం చేస్తున్నారని అన్నారు. దానివల్ల తూకం చేసిన ధాన్యం వర్షానికి తడిసిపోతుందన్నారు. వర్షానికి తడిసిన ప్రతి గింజలు ప్రభుత్వమే కొ నుగోలు చేస్తుందని మంత్రులు చెప్పినప్పటికీ రైస్ మిల్లులలో తడిసిన ధాన్యాన్ని కటింగ్ చేసి తూకం నుంచి తగ్గించడం జరుగుతుందని దీనిని అధికారులు పట్టించుకోని న్యాయం చేయాలని కోరారు. అనంతరం జిల్లా సివిల్ సప్లై అధికారి మోహన్ బాబుతో ఫోన్లో మాట్లాడి సమస్య ను పరిష్కరించాలని, లేదంటే కలెక్టర్ కార్యాలయం ముందు రైతులతో కలిసి ధర్నా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వివేకానంద రెడ్డి, మండల అధ్యక్షులు రాజు నాయక్, బిజెపి సీనియర్ నాయకులు సుధాకర్ ఆచార్య, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బాబయ్య, బూత్ అధ్యక్షులు మల్లేశం, సూర్యకాంత్, పాండు నాయక్, శివకుమార్, శివరాం, కావలి గోపాల్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

**శామీర్‌పేట, మే 21, ప్రభాతవార్త:** మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయమని, యువతకు ప్రాధాన్యతకు, ఆధునీకరణ, సాంకేతిక పలు రంగాల్లో సంస్కరణలు ప్రవేశ పెట్టిన మహ నాయకులు రాజీవ్‌గాంధీ అని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు బీమిడి జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్‌లో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద స్వర్గీయ మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి జైపాల్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా బీమిడి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో నాడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆధునీకరణతో పాటు యువతకు కంప్యూటర్లు, సాంకేతిక రంగాలను బలోపేతం చేయటానికి రాజీవ్‌గాంధీ పలు సంస్కరణలు ప్రవేశపెట్టారని అన్నారు. దేశంలో కంప్యూటరైజేషన్, టెలికమ్యూనికేషన్‌లో ఆధునికంగా ఎన్నో మార్పులు తీసుకువచ్చారన్నారు. విదేశీ విధానంలో చురుకైన పాత్రను రాజీవ్‌గాంధీ పోషించారన్నారు. స్థానిక స్వపరిపాలనకు సంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు తీసుకరావటం జరిగిందన్నారు. ఓటు హక్కును కూడ 21నుంచి 18ఏళ్ల వయస్సుకు తగ్గించి యువతకు ప్రాధాన్యత ఇచ్చి ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్‌గాంధీదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరయాంజాల్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ చైర్మన్ పెండెం లక్ష్మీనారాయణ, ధర్మకర్తలు జి.హరికృష్ణ, బి.సంజీవరెడ్డి,టి.జగదీశ్‌గౌడ్, మాజీకౌన్సిలర్ ఎస్.మధుసూదన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచు టి.శంకర్‌గౌడ్, పార్టీ ఉపాధ్యక్షులు కె.రాము, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్‌యాదవ్, కార్యదర్శి టి.మురళీగౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షులు ధర్మారెడ్డి, మైనార్టీసెల్ అధ్యక్షులు జాఫర్, కాంగ్రెస్‌నాయకులు ఎం. మల్లేశ్‌యాదవ్, టి.దర్శన్‌గౌడ్, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నేడు హైస్కూల్‌కు ఎమ్మెల్యే రాక

**నందిగామ, మే 21 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యాభివృద్ధిలో భాగంగా ఈనెల 22వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే, ఆ పాఠశాల పూర్వ విద్యార్థి వీర్లపల్లి శంకర్ హాజరవుతున్నారని కాంగ్రెస్ నేత, పూర్వవిద్యార్థి జిల్లెల్ల బాల్‌రెడ్డి, మాజీసర్పంచ్ కొమ్ము కృష్ణలు తెలిపారు. పాఠశాల అభివృద్ధిపై జరిగే ఈకార్యక్రమానికి తన, మన, ప్రాంతీయ భేదం లేకుండా, రాజకీయపార్టీలను పక్కనపెట్టి అందరూహాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## చౌదరిగూడలో పిడుగుపాటు

**జిల్లెడుచౌదరిగూడ, మే 21, ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో బుధవారం పిడుగు పడింది. మండలకేంద్రంలో సాయంత్రం ఈదురుగాలులతో కూడినవర్షం కురి సింది. ఈవర్షంలో మండలకేంద్రంలోని నయార పెట్రోల్‌బంక్ సమీపం లో పిడుగుపడి మంటలుచెలరేగాయి. ఆసమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడం వల్ల ఎలాంటిప్రాణనష్టం జరగలేదని స్థానికులు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధే మా లక్ష్యం

**జిల్లెడుచౌదరిగూడ, మే, 21, ప్రభాతవార్త:** గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి పరచడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు అన్నారు. బుధవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పద్మారం గ్రామంలోని ఎస్సి వాడలో అంతర్గత మురుగుకాలువ పనులను ఆయన ప్రారంబించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాలతో గ్రామాలలో అనే అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సి సబ్‌ప్లాన్‌లో భాగంగా 4.5లక్షలతో అంతర్గత మురుగుకాలువ పనులకు భూమిపూజ చేశారు. గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధిగా భావించి మండలంలోని ఆయా గ్రామాలలో ఎస్సి సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు మండల ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమైతుందని అన్నారు. ఈకార్యక్రమంలో పద్మారం మాజీ సర్పంచ్ లక్ష్మీసుధ, నర్సింలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి, సలీం, అశోక్, మోహన్, వెంకటేష్, బీమయ్య, వెంకటేష్‌యాదవ్, భావయ్య, కృష్ణ, బుచ్చయ్యపంతులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో రాజీవ్ హస్తం

**షాద్‌నగర్, మే 21, ప్రభాతవార్త:** పిన్నవయసులోనే భారతదేశ ప్రధానమంత్రి పదవిని అధిష్టించి దేశ భవిష్యత్తుకు తీసుకున్న నిర్ణయాలు నేటి అభివృద్ధికి ఎంతో కీలకమని, భారత ఆధునిక స్వామికులు రాజీవ్‌గాంధీ అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలో కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్న ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దూరదృష్టితో సైన్స్, టెక్నాలజీ, ఆర్థికవ్యవస్థను సరళీకృతంచేయడం, పరిశ్రమలకు రాయితీలు, పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టత వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని, 21వ శతాబ్దిలో దేశాన్ని నూతన పథకంలో నడిపించేలా దిశానిర్దేశం చేశారన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ బాబర్ అలీఖాన్, మాజీ కౌన్సిలర్ శ్రావణి, నాయకులు బస్వం, చెంది తిరుపతిరెడ్డి, రఘు నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, అందె మోహన, ఇబ్రహీం, మురళీమోహన్(అప్పి), కొప్పునూరి ప్రవీణ్, మాధవులు, బాల్‌రాజ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## లబ్దిదారునికి సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**కొమురవెల్లి, మే 21, ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన చిక్కుడు సత్తయ్యకు ప్రభుత్వం నుంచి మంజూరైన(సిఎంఆర్ఎఫ్) రూ.60 వేల చెక్కును బుధవారం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రుల మహేష్ చేతుల మీదుగా లబ్దిదారునికి అందించారు. చెక్కును వెంటనే తమ ఖాతాలో జమ చేసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబానికి అండగా ఉండి సహాయ సహకారాలు అందించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లె రాజేశ్వర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొండ శ్రీధర్, పాశం స్వామి, చిక్కుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేద్దాం

### -శ్రీవర్ధన్‌రెడ్డిని ఆహ్వానించిన బజరంగ్‌దళ్ సభ్యులు

**షాద్‌నగర్, మే 21, ప్రభాతవార్త:** విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించే వీర హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా నిర్వహించే శోభాయాత్ర కార్యాక్రమానికి రావాలంటూ బజరంగ్‌దళ్ సభ్యులు బిజెపి నాయకుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డికి ఆహ్వానాన్ని అందజేశారు. నేటి సాయంత్రం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయం నుండి పెద్ద జానంపేట వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. హిందూ బంధువులు అందరు అధిక సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా సురక్ష ప్రముఖ్ ప్యాట వంశీ, ప్రఖండ సంయోజక్ రొళ్ల గిరి, విహెచ్‌పి హన్మంత్ రెడ్డి, పట్టణ సంయోజక్ వినయ్ కుమార్, పట్టణ కార్యదర్శి వాద్యాల ఋషికేష్, కోశాధికారి దిలీప్‌రెడ్డి, హిందూ వాహిని అధ్యక్షుడు రాఘవేందర్, కో కన్వీనర్ ఉడుత అజయ్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో ఎమ్మెల్యే సహకారం మరువలేనిది

### -టిపిసిసి ప్రధానకార్యదర్శి ధారాసింగ్

**పెద్దేముల్, మే 21, ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధిలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారం మరువలేనిదని టిపిసిసి ప్రధానకార్యదర్శి ధారాసింగ్ అన్నారు. బుధవారం పెద్దేముల్ మండలం జనగాం గ్రామంలోని బీరప్ప దేవాలయానికి రూ.8లక్షల ఎస్‌డిఎఫ్ నిధులతో సిసి రోడ్డు పనులను కోటపల్లి మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డితో కలిసి ధారాసింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాండూరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిచేసేందుకు ఎమ్మెల్యే ఎనలేని కృషిచేస్తున్నారని అన్నారు. అడిగినవెంటనే బీరప్ప ఆలయానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో మత్స్యకార సొసైటీ డైరెక్టర్ నర్సిములు, నాయకులు శివకుమార్, బుల్ల పెంటప్ప, లక్ష్మప్ప, పెద్దనర్సప్ప, అనంతయ్య, శ్రీను, సంజీవ్ దస్థప్ప, వెంకటప్ప గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎసిపిని అభినందించిన డిజిపి

**షాద్‌నగర్, మే 21, ప్రభాతవార్త:** ఓ హత్య కేసులో మిస్టరీని ఛేదించి కేసును కొలిక్కి తెచ్చిన నేపథ్యంలో షాద్‌నగర్ ఎసిపి రంగస్వామిని స్వయానా రాష్ట్ర డిజిపి జితేందర్ అభినందించారు. షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని కద్తాల పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఓ హత్య కేసును ఎసిపి రంగస్వామి బృందం దర్యాప్తు జరిపారు. అప్పటి కద్తాల సిఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్, హోంగార్డు పాండు నేతృత్వంలోని బృందాన్ని డిజిపి జితేందర్ గురువారం అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కద్తాల పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రైమ్ నెం.130/24 కేసులో సెక్షన్లు 302, 202, 364, 120బి ఐపిసి, ఎస్సి, ఎస్టి చట్టంలోని 3(2)వి పలు సెక్షన్ల కింద నమోదైన కేసులో ఈ దారుణహత్య కేసు పరిష్కరించడంలో ఎసిపి రంగస్వామిబృందం అత్యంతకీలకంగా వ్యవహరించింది. కేసుకు సంబంధించి ఎంతో అంకితభావంతో దర్యాప్తు జరిపి, కేసులో పురోగతి పట్ల కృషి చేసినందుకు రాష్ట్ర డిజిపి అభినందిస్తూ రివార్డును అందజేశారు. షాద్‌నగర్ ఎసిపిగా పనిచేసిన రంగస్వామి ఇటీవలే జరిగిన సాధారణ బదిలీల్లో డిజిపి కార్యాలయానికి ఆయన రిపోర్టు చేశారు. ప్రస్తుతానికి ఎసిపి రంగస్వామి ఇంకా రిలీవ్ కాలేదు. బదిలీ సమయంలో రంగస్వామి ఈ అవార్డును డిజిపి జితేందర్ చేతుల మీదుగా అందుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తన బదిలీ తర్వాత ఇలాంటి అత్యున్నత అభినందనలు రావడం ఎంతో సంతోషంగా ఉందని ఈసందర్భంగా ఎసిపి రంగస్వామి స్థానిక మీడియాకు తెలిపారు.

## సాంకేతికరంగంలో మార్పులు తెచ్చిన ఘనత రాజీవ్‌గాంధీదే

**శామీర్‌పేట, మే 21, ప్రభాతవార్త:** దేశంలో సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కిందని శామీర్‌పేట మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుంకి రమేశ్ పేర్కొన్నారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని మజీద్‌పూర్‌లో స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిసందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. మండలకాంగ్రెస్ ప్రధానకార్యదర్శి తుంకి రమేశ్ ఆధ్వర్యం లో రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా తుంకి రమేశ్ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ సేవలు ఆమోఘమని, దేశం కోసం ప్రాణత్యాగం చేసి మహానాయకులు రాజీవ్‌గాంధీ అని అన్నారు. కార్య క్రమంలో ఆయనతోపాటు మేడ్చల్ ఎఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచులు ఎల మల్లేశ్, కంటం కృష్ణారెడ్డి, నాయకులు తుంకి స్వామి, నాటకారి వెంకటయ్య, జి. శ్రీకాంత్‌రెడ్డి, కె.వెంకటేశ, ఎం.మల్లేశ్, ఎ.యాదగిరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళులు

**సిద్దిపేట రూరల్/కొమురవెల్లి, చిన్నకోడూరు, మే 21,ప్రభాతవార్త :** స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అశయాలను కొనసాగించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా రాజీవ్ రహదారి సమీపంలో ఆయన విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ ప్రయోజనాల కోసం ఎన్నో ఆర్థిక సంస్కరణలు తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. రాజీవ్‌గాంధీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. 18 ఏళ్లకే యువతకు ఓటు హక్కును కల్పించిన ఘనత కూడా ఆయనదేనన్నారు. దేశం కోసం ప్రాణాత్యాగాలు చేసిన కుటుంబం రాజీవ్‌గాంధీ కుటుంబమన్నారు. కార్యక్రమంలో గంప మహేందర్‌రావు, లక్ష్మీ, కలీం, మధు,పూజల గోపికృష్ణ, సతీష్‌గౌడ్, మెరుగు రాజు, కవిత, పద్మ, రజిని. రాకేష్, వహాబ్ తదితరులు పాల్గొన్నారు.

**కొమురవెల్లిలో...**

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి వేడుకలను జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆదేశానుసారం బుధవారం కొమురవెల్లి గ్రామ అధ్యక్షులు లింగంపల్లి కనకరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ఎల్లయ్య, లింగం, రాజు, వంశీ, కనకరాజు,కిరణ్, ప్రశాంత్, మహేష్, బాల్‌నర్సయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో...**

దేశానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఐటి టెక్నాలజీ అందించిన గొప్ప మహనీయుడు స్వర్గీయ రాజీవ్‌గాంధీ అని చిన్నకోడూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ అన్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో బుధవారం స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు పరశురాములు, భూపతిరెడ్డి, రాజు, సలీం, ప్రశాంత్, గణేష్, చందు, నరేష్, కనకరాజు, శేషు, రాజు, మధు, భాస్కర్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

**మిరుదొడ్డిలో...**

**మిరుదొడ్డి, మే 21, ప్రభాతవార్త :** దేశంలో ఐటి విప్లవాన్ని తీసుకువచ్చిన మహానేత స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెన్నై భూపాల్‌గౌడ్ అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో బుధవారం మాజీ ప్రధాని,భారతతర్న స్వర్గీయ రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి వేడుకులను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ తీసుకవచ్చిన ఐటి విప్లవం ద్వారా దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందన్నారు. అనేక సంస్కరణలు అయన హాయంలోనే జరిగాయని భూపాల్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మంచాల మల్లేశం, రంగనాబోయిన రామకృష్ణ, నేరండ్ల కృష్ణగౌడ్, మల్లపల్లి రత్నాకర్,పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

**గజ్వేల్‌లో...**

**గజ్వేల్, మే 21 (ప్రభాతవార్త):** దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ స్ఫూర్తితో యువత దేశ ఐక్యత సమగ్రతలపై దృష్టి సారించాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ పేర్కొన్నారు. బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి నివాసంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దివంగత ప్రధానమంత్రులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలను దేశ ప్రజలు ఎన్నడూ మరిచిపోరన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నించిన ఉగ్రమూకలను మట్టుబెట్టించిన ఘనత వారికే దక్కిందన్నారు. దేశం కోసం తుపాకీ గుండ్లకు బలైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను, యువతకు 18 ఏళ్లకు ఓటు హక్కు, పంచాయతీలకు నేరుగా నిధులు చేర్చిన ఘనత రాజీవ్‌గాంధీకి దక్కుతుందన్నారు.

దేశాన్ని ఆధునీకరించాలనే లక్ష్యంతో కంప్యూటరీకరణపై దృష్టి సారించగా, టెలీ కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కేంద్రంలోని బిజెపి సర్కార్ దేశాన్ని కులాలు, మతాలు, ప్రాంతాల పేరిట విభజించి పాలిస్తున్నట్లు విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, సుఖేందర్‌రెడ్డి, మండల మైనార్టీ మాజీఅధ్యక్షుడు అజ్గర్, కరుణాకర్‌రెడ్డి, గుంటుకు శ్రీనివాస్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, జంగం రమేష్‌గౌడ్, నక్క రేగొండగౌడ్, కిష్టారెడ్డి, అంజద్, చెప్యాల శేఖర్, దప్పు గణేష్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు శివులు, అరుణ్‌కుమార్, జహంగీర్, హసన్, బాల్‌రెడ్డి, మహంకాళి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

**దౌల్తాబాద్‌లో...**

**హత్నూర మే 21, ప్రభాతవార్త :** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని హత్నూర మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దౌల్తాబాద్ గ్రామంలో బుధవారం నిర్వహించారు. మండలంలోని దౌల్తాబాద్‌లో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కర్రే కృష్ణ, పార్టీ మైనార్టీచర్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ హకీం, నాయకులు కొన్యాల వెంకటేశం, శివరాజ్, ఎండి అజీజ్ సయ్యద్ సాదికలి, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో రాజీవ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



గజ్వేల్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్దార్‌ఖాన్ తదితరులు



దౌల్తాబాద్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి : డిఇవో

**టేక్మాల్, మే 21 ప్రభాతవార్త:** ఉపాధ్యాయులకు 5 రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం మండల కేంద్రంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్నారు. బుధవారం 5 రోజుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ సందర్శించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయుడు నిరంతరం వృత్తిలో వస్తున్న నూతన ధోరణులను ఆకళింపు చేసుకుని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. జూన్ నెలలో నిర్వహించబోయే బడిబాటను విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలలో నమోదు శాతాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మండల సుజాత, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

## విజేతగా ముద్దాయిపేట వాలీబాల్ జట్టు


విజేతగా నిలిచిన ముద్దాపేట వాలిబాల్ జట్టు క్రీడాకారులు

**పుల్కల్, మే 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సూరెడ్డి ఇటిక్యాల గ్రామంలో నిర్వహించిన ఉమ్మడి పుల్కల్ మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో ముద్దాయిపేట జట్టు విజేతగా నిలిచింది. ఉమ్మడి పుల్కల్ మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో 18 జట్లు తలపడగా మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ముగింపు పోటీ ముద్దాయిపేట, అంగడిపేట జట్లు తలపడ్డాయి. ఫైనల్ పోటీల్లో ముద్దాయిపేట జట్టు అంగడిపేట జట్టును ఓడించి ఫైనల్ విజేతగా నిలచింది. విజేత ముద్దాయిపేట జట్టుకు కప్పు, బహుమతులను అందచేసి జట్టు క్రీడాకారులు అరవింద్, సదానందం, విజయ్, సౌజన్‌బాబు, శ్రీకాంత్, క్రిషలను టోర్ని నిర్వాహకులు, ముద్దాయిపేట గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

## ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే


ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, మే 21, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి బుధవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సందర్శించారు. ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని ఎమ్మెల్యే క్షుణంగా తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ గిరి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రతి విభాగంలో సిబ్బంది అంకిత భావంతో సేవలందించాలన్నారు. వచ్చే మాసంలో మరో మారు ప్రతి విభాగంతో సమావేశం అవుతానన్నారు. ఎమ్మెల్యేతో పాటు నాయకులు నామ రవికిరణ్, మాజీ పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు మోహియుద్దీన్, బండి మోహన్ తదితరులు ఉన్నారు.

## ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిలవాలి

### సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కవితాదేవి



మాట్లాడుతున్న న్యాయమూర్తి కవితా దేవి

**జహీరాబాద్, మే 21, ప్రభాతవార్త:** జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటి చైర్మన్ కవితాదేవి ఉపాధ్యాయులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచాలని, అందుకు తగిన కృషి చేయాలన్నారు. ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేటు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిలవాలని వివరించారు. బాల కార్మికులపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు సిర్గాపూర్‌లో తిరంగ ర్యాలీ

**సిర్గాపూర్, మే 21, ప్రభాతవార్త:** ఈ నెల 22న సిర్గాపూర్‌లో తిరంగ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు బిజెపి మండల అధ్యక్షుడు శంకర్‌రావు పాటిల్ పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే తిరంగ ర్యాలీలో పార్టీలకు అతీతంగా పాల్గొనాలని సూచించారు. ఆపరేషన్ సింధూర్‌లో పాలొన్న జవాన్లకు దేశం తరఫున గౌరవం తెలపాల్సిన అవసరం ఉందన్నారు. తిరంగ ర్యాలీకి ముఖ్య అతిథులుగా బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర ఇసి సభ్యులు అరుణ్‌రాజ్ షెరికర్, జిల్లా మండలి సభ్యులు రాజ్‌కుమార్ సిగ్రే, మాజీ అధ్యక్షులు గోపాలరెడ్డిలు హాజరవుతున్నారని, అందుకు మండల పదాధికారులు ప్రతి గ్రామం నుంచి 10 మందికి తగ్గకుండా తిరంగ ర్యాలీకి సమయానికి హాజరు కావాలని శంకర్‌రావు పాటిల్ వివరించారు.

## నర్సరీలను పరిశీలించిన ఎంపిఒ

**కంది, మే 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆరుట్ల, చిద్రుప్ప, బేగంపేట గ్రామాలను ఎంపిఓ మహేందర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల రికార్డులను, నర్సరీలను పరిశీలించారు.


చిద్రుప్ప పంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిఓ మహేందర్‌రెడ్డి

# ధాన్యం బస్తాలను తరలించాలని రోడ్డెక్కిన అన్నదాతలు

**కొల్చారం, మే 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రంగంపేట సొసైటీ ఆధ్వర్యంలో పైతర గ్రామంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన వరి ధాన్యం బస్తాలను తరలించాలని డిమాండ్ చేస్తూ రైతులు బుధవారం మెదక్-సంగారెడ్డి రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. రైతులు చేపడుతున్న ఆందోళనకు తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎస్ఐ మహమ్మద్ గౌస్‌లు సంఘటన స్థలానికి చేరుకుని రైతులను సముదాయించి ధర్నా, రాస్తారోకను విరమింపచేయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యంను తూకం వేసి రోజులు గడుస్తున్నా ధాన్యాన్ని లారీల సమయానికి రాక వరి ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రంలోని మూలుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో ధాన్యం బస్తాలు తడిసి పోయి మొలకెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.


మెదక్-సంగారెడ్డి రహదారిపై రాస్తా రోకో చేస్తున్న రైతన్నలు


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డిఈఓ రాధాకిషన్

## వృత్యంతర శిక్షణ శిబిరాన్ని తనిఖీ చేసిన డిఈఓ

**అల్లాదుర్గం, మే 21, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌జిటి, ఎల్ఎఫ్ఎల్ ఉపాధ్యాయులకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణను కొనసాగుతున్న ఉపాధ్యాయిల వృత్యంతర శిక్షణ తరగతులను జిల్లా విద్యాధికారి రాధా కిషన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాధాకిషన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆటపాటలతో విద్యాబోధన చేయాలని, పాఠశాలల విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని సూచించారు. 5 రోజుల పాటు కొనసాగే శిక్షణ శిబిరాల్లో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలన్నారు. శిక్షణ తరగతులను ప్రతి ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు, ఎమ్మెల్సీ సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గుణాత్మక విద్య అందించడమే లక్ష్యం : డిఇవో

**పాపన్నపేట, మే 21, ప్రభాతవార్త :** విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలన్న లక్ష్యంతోనే ఉపాధ్యాయులకు ఐదురోజుల శిక్షణా కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ వెల్లడించారు. ఆయన బుధవారం మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు తగిన సూచనలు సలహాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 1600 మంది ఎస్జీటీలకు 1800 మంది స్కూల్ అసిస్టెంట్లకు, ప్రధాన ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఆయా మండల కేంద్రాలలో శిక్షణ నిర్వహిస్తుండగా స్కూల్ అసిస్టెంట్లకు జిల్లా కేంద్రంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు శిక్షణకు సమయానికి హాజరవుతున్నట్లు ఆయన వెల్లడించారు. శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు . ఆయన వెంట మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి ఇతర ఉపాధ్యాయులు ఉన్నారు.

### నాగల్‌గిద్దలో...


శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

**నాగల్‌గిద్ద, మే 21, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. మండలంలోని జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు, ఎస్జీటిగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మన్మథ కిషోర్ మాట్లాడుతూ ఎస్ఎల్ఎస్‌పై రిసోర్స్ పర్సన్‌లు శిక్షణ ఇస్తారని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలని సూచించారు.

## ఎస్ఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**హత్నూర మే 21 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం హత్నూర నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మండలంలోని అంశాలపై ఎస్ఐతో చర్చించారు. ఎస్సైని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి యమ్మీ హకీమ్ హత్నూర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్రే కృష్ణ. నాయకులు శివరాజ్ మణిదీప్, సాయి,,వెంకటేష్ , సయ్యద్ సాదిక్ అలీ పాల్గొన్నారు.



ఎస్ఐ ని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు


బోనాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న మహిళలు

## ఘనంగా రేణుక ఎల్లమ్మ బోనాల ఊరేగింపు

**పాపన్నపేట, మే 21, ప్రభాతవార్త :** పాపన్నపేట మండల నాగ్సన్‌పల్లి గ్రామంలో గల శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం బోనాల ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## పుల్‌కర్తిలో ఘనంగా ముగిసిన సప్తహా


పుల్‌కుర్తిలో వార్కరీ ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

**మనూర్, మే 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పుల్‌కుర్తి గ్రామంలో వారం రోజులుగా గ్రామ ప్రజల సభిక్షాన్ని కాంకిస్తూ భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న సప్తహా కార్యక్రమాలు బుధవారంతో ఘనంగా ముగిసాయి. సప్తహా ముగింపును పురస్కరించుకుని అత్తారింటికి వెళ్లిన అడపడుచులు కుటంబ సభ్యులతో పుట్టింటికి చేరుకోవడంతో గ్రామంలో సందడి నెలకొంది. సప్తహా ముగింపు రోజైన బుధవారం ఆడపడుచు, వార్కరీలు భజనలు చేస్తూ ఆటలు ఆడుతూ నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది. నగర సంకీర్తన అనంతరం అంతర్గమ ఆశ్రమ పీఠాధిపతి కరణ్ గజేంద్ర మహారాజన కీర్తలను వినిపించారు.

## పేదింటి వధువుకు పుస్తెలు, మెట్టెలు అందజేత

**మర్కుక్, మే 21 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన మేకల రజిత రమేష్ దంపతుల కూతురు వైశాలి వివాహానికి బుధవారం బిఆర్ఎస్ బిసిసెల్ మండల అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల కనకయ్య పుస్తెమట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా నిరుపేద కుటుంబాలకు నావంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పిట్ల మహేష్, యూత్ అధ్యక్షుడు చిన్నబోయిని మురళీ కృష్ణ, చెక్కల నర్సింలు, ఉప్పరి యాదగిరి, బోయిని గండయ్య, ప్రభాకర్, రాజు, స్వామి, కొట్టాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి తహసీల్దార్‌గా జయరాం

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 21,ప్రభాతవార్త:** సంగారెడ్డి తహసీల్దార్‌గా జయరాం బుధవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి తహసీల్దార్‌గా పనిచేసిన దేవిదాస్ జిన్నారంకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ జయరాంకు టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు జావీద్ అలీ, సెక్రటరీ రవి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ సేవల ప్రాధాన్యత, ప్రజల మేలు కోసం కలిసి పనిచేద్దామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి నిర్మల రాజకుమారి, ఆంజనేయులు,పట్టణ సెక్రెటరీ యాదవ్ రెడ్డి నాల్గవ తరగతి ఉద్యోగుల సంగం అధ్యక్షులు షరీఫ్ దుర్గయ్య, నరసింహ రెడ్డి, శంకర్ ఇతర సంఘం సభ్యులు పాల్గొన్నారు.


నూతన తహసీల్దార్‌కు పుష్పగుచ్చం అందిస్తున్న టీఎన్జీవో నాయకులు

# దేశంలో సాంకేతిక అభివృద్ధికి కృషిచేసిన ఘనత రాజీవ్ గాంధీదే

### కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి

**నర్సాపూర్ మే 21 ప్రభాతవార్త :** భారతదేశం సాంకేతికంగా అభివృద్ధి చెందడానికి కృషి చేసిన ఘనత దివంగత ప్రధాని రాజీవ్ గాంధీదేనని కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, పిసిసి ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ పరిపాలనలో సంస్కరణలు తెచ్చిన నాయకుడని దేశ సౌభ్రాతృత్వం కాపాడడానికి ప్రాణాన్ని త్యాగంచేసిన మహనీయుడన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం ఉద్యోగ నిరుద్యోగ యువతకు యువ వికాసం, పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గుప్తా, నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షుడు రిజ్వాన్, మాజీ ఎంపీపీలు జ్యోతి సురేష్‌నాయక్, లలిత నర్సింగ్ నాయక్, శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మల్లేశం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ రషీద్, మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అజ్మత్, నాయకులు దాడిగా నరేష్, అశోక్, మలేష్‌యాదవ్, శ్రీశైలంయాదవ్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## సిఐటియును బలపరుద్దాం : ప్రవీణ్‌కుమార్

**సదాశివపేట, మే 21, ప్రభాతవార్త:** ఈ నెల 28వ తేదీన పట్టణ శివారులోని ఎంఆర్ఎఫ్ కర్మాగారంలో జరిగే ఎన్నికల్లో సిఐటియు అభ్యర్థి చుక్క రాములను గెలిపించి వేతన ఒప్పందం సాధించుకుని ఉద్యోగ భద్రతను దక్కించుకుందామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం కర్మాగార ఆవరణలో నిర్వహించిన ప్రచారంలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములును బలపర్చి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇతర కార్మిక సంఘం నాయకులు చేసే అబద్దపు ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దన్నారు. కార్మిక శ్రేయస్సును కోరే సిఐటియుకు మద్దతు పలకాల్సిన అవసరం ప్రతికార్మికుడిపై ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంఆర్ఎఫ్ యూనియన్ నాయకులు నర్సింలు, కృష్ణమూర్తి, రాజయ్య, వివజవీర్, వెంకటేశం, రమేష్‌రెడ్డి, హాజీ, బాగారెడ్డి, లక్ష్మారెడ్డి, అంజయ్య ఉన్నారు.

## నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి : ఎవో



మైకోడ్‌లో ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ మహేష్ చౌహన్

**మనూర్, మే 21, ప్రభాతవార్త:** రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని ఫర్టిలైజర్ డీలర్లకు మండల వ్యవసాయ అధికారి మహేష్ చౌహన్ సూచించారు. బుధవారం మైకోడ్ గ్రామంలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. దుకాణంలోని పత్తి తదితర విత్తనాలను ఏఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ ఓ మహేష్ చౌహన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విత్తనాలను, ఎరువులను విక్రయించలని సూచించారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 24న జహీరాబాద్‌లో ముస్లింల బహిరంగ సభ

### -హాజరవుతున్న ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు చైర్మన్



మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు బిల్లు వ్యతిరేక చట్టం కన్వీనర్ అబ్దుల్ సుపూర్

**జహీరాబాద్, మే 21, ప్రభాతవార్త:** కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏ ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించిన ముస్లిం బోర్డ్ చట్టానికి వ్యతిరేకంగా ఈ నెల 24న జహీరాబాద్ పట్టణంలో ముస్లింలతో కలిసి బహిరంగసభను నిర్వహిస్తున్నట్లు, సమావేశానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు చైర్మన్ కాలిద్ షఫీ ఉల్లా రెహమాన్, ఎంఐఎం నాయకులు ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసిలు హాజరుతున్నట్లు వక్ఫ్‌బోర్డు చట్టం వ్యతిరేక చట్టం జహీరాబాద్ కన్వీనర్ అబ్దుల్ సుపూర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లిం నాయకులు, మతపెద్దలతో కలసి ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో అబ్దుల్ సురూర్ మాట్లాడుతూ ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తూ ముస్లిం వక్ఫ్‌బోర్డులో ఇతరులకు స్థానం కల్పించడం సరికాదని విమర్శించారు. దేశవ్యాప్తంగా వక్ఫ్‌బోర్డు బిల్లు చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమంలో భాగంగా ఈ నెల 24న జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా మైదానంలో సాయంత్రం 5 గంటలకు బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు.

## భవాని మాతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే


భవాని మాతను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే

**సిర్గాపూర్, మే 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మూణ్యానాయక్ తండాలో(వాసర్) భవానిమాత, సేవాలాల్ మహారాజ్ విగ్రహాల ప్రతిష్టాపన పూజాకార్యక్రమాలు బుధవారం శోభాయమానంగా నిర్వహించారు. ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేను ఆలయ కమిటీ బాధ్యులు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు ఆలయానికి జగదీష్ మహారాజ్, మాజీ సర్పంచ్ రాంసింగ్, లచ్చునాయక్, బిక్కు నాయక్, తౌర్యానాయక్, శంకర్ నాయక్, బద్దు నాయక్, పుండ్లికన, తుకారాం, వెంకట్ తదితరులు ఉన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**కొల్చారం, మే 21, ప్రభాతవార్త:** గుర్తు తెలియని కుళ్లిపోయిన వ్యక్తి శవాన్ని బుధవారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి శివారు ఏడుపాయలకు వెళ్లే మొదటి బ్రిడ్జి వద్ద పోలీసులు కనుకొన్నారు. ఎస్ఐ మహమ్మద్‌గౌస్ కథనం ప్రకారం... చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు బ్రిడ్జిపై మృతదేహాన్ని గమనించి కొల్చారం పోలీసులకు సమాచారం అందించారన్నారు. మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి వయసు 30 నుంచి 40 సంవత్సరాల ఉండవచ్చని చెప్పారు. గ్రీన్ కలర్ ఫుల్‌షర్ట్, నల్లని జీన్స్‌పాయింట్, శవంపై ఎడమవైపు చాతిపై సంగీత అని పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు. పోతంశెట్టి పంచాయితీ కార్యదర్శి అరుంధతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహమ్మద్ గౌస్ వివరించారు. గుర్తు తెలియిన వ్యక్తి శవాన్ని గుర్తిస్తే కొల్చరం పోలీసు ఠాణాకు సమాచారం అందించాలని ఎస్సై వివరించారు.

## విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

**చౌటకూరు, మే 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బద్రిగూడెం గ్రామానికి చెందిన వడ్డే రాములుకు చెందిన గేదె విద్యుత్‌ఘాతానికి గురై మృతి చెందింది. బాధితుడు రాములు కథనం ప్రకారం...గ్రామ శివారులోకి వెళ్లి గేదెలను మేపుతుండగా గాలి దుమారంతో భారీ వర్షం కురుస్తుండటంతో గేదెలను ఒక చోటకు తీసుకుపోతున్న తరుణంలో బోరు బావి వద్ద ఉన్న సర్వీస్ వైరుకు గేదె తగలడంతో కరెంట్ షాక్‌కు గురై లక్ష రూపాయల విలువ గల గేదె అక్కడికి అక్కడే మృత్యువాత పడిందన్నారు.


బద్రిగూడెంలో విద్యుత్‌ఘాతానికి మృతి చెందిన గేదె